# ఒకటో అధ్యాయం

## పి.ఎస్. నారాయణ జీవితం – రచనలు

మానవ జీవితానికి, ఒక జాతి సంస్కృతికి అద్దం వంటిది సాహిత్యం. ఒక ఆదర్శాన్ని ప్రజలకు చూపించి, ఆ లక్ష్య సాధనకు కావలసిన ప్రబోధాన్ని కలిగించే శక్తి సాహిత్యానికుంది. సమాజానికి, సాహిత్యానికి పరిణామశీలం ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా రాతియుగం నుండి నేటి యుగం వరకు సమాజం మార్పు పొందుతూ వచ్చింది. అదేవిధంగా ఆంధ్రదేశంలోనూ కాలక్రమంలో ఎన్నో మార్పులు వచ్చాయి.

క్రీ.శ. 11వ శతాబ్దంలో నన్నయ్య ఆంధ్రమహాభారత రచన ప్రారంభించటంతో తెలుగు లిఖిత సాహిత్య చరిత్ర ఆరంభమయింది. దాదాపు వెయ్యేళ్ల పరిణామం తరువాత తక్కిన భారతదేశంలోని వివిధ భాషల్లో లాగానే 19వ శతాబ్దిలో తెలుగు సాహిత్యరంగంలో ఒక విప్లవాత్మకమైన పరిణామం వచ్చింది. ముఖ్యంగా ఊనిక పద్య సాహిత్యం నుండి వచన సాహిత్యం వైపు మళ్ళింది.

“తెలుగు సాహితీ స్రవంతికి క్రీ.శ. 19వ శతాబ్దిలో పెద్ద మలుపు వచ్చింది. పడమటి గాలులు వీచాయి. కొత్త వెలుగులు ప్రసరించాయి. పాఠకులకూ రచయితలకూ కొత్త అభిరుచులు ఏర్పడ్డాయి. కొత్త ప్రక్రియలనూ కొత్త ఆలోచనారీతులనూ పాదుకొలిపాయి. సమాజ వికాసోద్యమానికి పద్యం కన్న వచనమే చాలా అనుకూలమనిపించింది. అది అత్యవసరమూ అనిపించింది. పత్రికల ప్రచురణలు జరిగిన తరువాత అది నిజమని నిరూపణ అయింది.”[1] అని పోరంకి దక్షిణామూర్తి పేర్కొంటారు.

“ఆధునిక యుగంలో, అందులోను స్వాతంత్ర్యానంతరం తెలుగు వచన రచన బహుముఖంగా విస్తృతిని పొందింది. ఈ విస్తరణానికి పూర్వరంగాన్ని పేర్కొనవలెనంటే, దానిలో రెండు ప్రధానాంశాలు కనిపిస్తవి. శ్రీ వీరేశలింగం గారు తెలుగు వచనానికి గల ప్రయోజనాన్ని గుర్తించి, సాహిత్యానికి చెందిన అనేక ప్రక్రియలకు దాన్ని ఉపయోగించడం ఒకటి. శ్రీ గిడుగు రామమూర్తి పంతులు గారి ద్వారా ప్రారంభించబడి, తదనంతరం విశేషంగా ప్రచారాన్ని పొందిన వ్యావహారిక భాషావాదం రెండవది.”[2] అని అన్నారు కులశేఖరరావు. దీనిని బట్టి వచన సాహిత్యానికి పెద్ద పీట వేసినట్లు భావించవచ్చు.

మానవునికి అనేక దశలలో, అనేక జీవన ప్రస్థానాలు వున్నాయి. ఈ జీవన ప్రస్థానాలలో ప్రతి దశలో మనిషి ఆలోచన, అనుభవం, వ్యక్తీకరణలో ఎన్నో పరిణామాలు చోటు చేసుకున్నాయి. మనిషి తన ఆలోచన, అనుభవాలను స్పష్టం చేయడానికి పూనుకున్నప్పుడు అది కళాత్మకతను జోడించుకుని సృజనాత్మక సాహిత్యం పుడుతుందని చెప్పవచ్చు. కాబట్టి సృజన ఒక అంతః సంఘర్షణతో కూడిన కళాత్మక వ్యాపారం. ఈ కళాత్మకతను అవగాహన చేసుకునే క్రమంలోనే కవిగాని, రచయితగాని పుడతాడు. ఇతని వ్యాపారమే సృజన.

“గద్యం కవీనాం నికషం వదంతి” అనే నానుడి గద్య రచనల విషయంలో సంస్కృత సాహిత్యంలో ప్రసిద్ధంగా ఉంది. పద్య రచన కంటే గద్య రచన చేయడం కష్టమైనదని పై నానుడిలోని అభిప్రాయం. కవిత్వం ఆవేశ ప్రధానమైనది. వచనం ఆలోచన ప్రధానమైనది. కళ కళ కోసమే వంటి సిద్ధాంతాలు సాహిత్య ప్రయోజనం ఆనందమేనని చెప్తాయి. సాహిత్య ప్రయోజనం సందేశమన్న అభిప్రాయం ప్రాచీన కాలంనుండి వుంది. ఈ రెండింటికి సమన్వయం కూడా వుంది. కాని మొదటి సిద్ధాంతాన్ని అనుసరించిన పద్య సాహిత్యం కంటే

గద్య సాహిత్యం తక్కువ. ముఖ్యంగా ఆధునిక కాలంలో గద్యం సందేశాత్మక లక్ష్యాన్నే అనుసరించింది. పాత్రల అంతర్ ప్రపంచాన్ని చిత్రించడం కథాకథనం, సమస్య పరిష్కార సూచన వంటి అంశాలు వచన సాహిత్యాన్ని ఆలోచనా ప్రధానమైనవిగా నిరూపిస్తాయి. ఆలోచనాత్మకం, కథాత్మకంగా పరిగణింపబడే నవల, కథ, నాటకాల రూపంలో సృజనాత్మక రచనలు చేసిన రచయిత పి.ఎస్. నారాయణ అనే కలం పేరు గల పొత్తూరి సత్యనారాయణ.

కృష్ణానది పరివాహక ప్రాంతంలోని గుంటూరు జిల్లా, మంగళగిరికి రెండు మైళ్ల దూరంలో ఉన్న చిన కాకాని అనే గ్రామంలో 1938 సంవత్సరంలో పొత్తూరి సత్యనారాయణ అనే అసలు పేరు గల పి.ఎస్. నారాయణ జన్మించారు.

## 1.1. పి.ఎస్. నారాయణ బాల్య జీవితం - కుటుంబ వాతావరణం

పి.ఎస్. నారాయణ సాధారణ సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. ఎగువ మధ్యతరగతికి చెందినవారు. వీరి తల్లిదండ్రులు పొత్తూరి రామయ్య, వరలక్ష్మమ్మ. తన నాలుగేళ్ల వయసులో తండ్రి పోయారు. తన చిన్నక్క తండ్రి కంటే వారం రోజుల ముందే చనిపోయింది. పదమూడేళ్ళ వయసులో తన తల్లి కూడ చనిపోయింది. పెద్దక్కయ్య యేటూరి లక్ష్మీరంగమ్మ, బావ యేటూరి అప్పారావు ఆయనని పెంచి పెద్ద చేసారు. తనకంటూ ఒక కుటుంబం లేదంటారు పి.ఎస్. నారాయణ. "నాకంటూ ఒక కుటుంబమే లేదు. మా అక్కయ్య కుటుంబమే నా కుటుంబం. ఆ యింట నన్ను అందరూ ఎంతో అభిమానంతో చూచేవారు."[3] తన బాల్యంలో చెప్పకోదగ్గ గొప్ప పనులు ఏమి చేయలేదని, తనెప్పడు ముప్పై అయిదు మార్కుల విద్యార్థినే అని నిరాడంబరంగా చెప్తాడాయన.

చిన్నప్పడు తనకు బొమ్మలు గీయడమంటే ఎంతో సరదా అంటారు ఆయన. "మాది పల్లెటూరు. ఆ రోజుల్లో డప్పు కొట్టుకుంటూ పక్కనున్న టౌన్ నుంచి టూరింగ్ టాకీస్ వాళ్ళు వచ్చి వాల్‌పోస్టర్లు అంటించి వెళ్లేవారు. వాళ్ళు అటు వెళ్లగానే మా ఇంటి గోడకు అంటించిన ఆ పోస్టర్ చించి లోపల ఇంట్లో గోడకు అంటించేవాణ్ణి. అప్పటి వాల్‌పోస్టర్‌లో ఇప్పటిలా ఫోటోలు ఉండేవి కాదు అందులో నటుల బొమ్మలు చేత్తో గీసినవే! ఆ బొమ్మలు చూస్తూ యధాతథంగా కాగితం మీద గీసేవాడిని."[4]

తనకు చెప్పకోదగ్గ బాల్యస్మృతులంటూ ఏమీ లేవని కొద్దిమంది స్నేహితులుండేవారని, వాళ్లతోనే ఎక్కువగా గడుపుతుండే వాడినని చెప్పారు. "ఏడో తరగతి నుండి ఒక స్నేహితుడి ఇంట్లో చందమామ వస్తుంటే తీసుకొని మొదటినుండి చివరిదాకా చదివేవాడిని. అప్పడే పెన్సిల్‌తో గీసిన కొన్ని బొమ్మలు చందమామకు పంపాను. బొమ్మలు పెన్సిల్‌తో కాదు ఇండియన్ ఇంకుతో వేయాలి అంటూ వారు ఓ లేఖ వ్రాశారు."[5] ఆ విధంగా వచ్చిన లేఖను అందరికి చూపించి చాలా రోజులు ఆనందపడ్డారట. చిన్న వయస్సులోనే తన చిన్నక్క, తల్లిదండ్రులు పోవటంతో అప్పటినుంచి శ్మశానం అంటే భయం లేకుండా పోయిందని, తల్లిదండ్రులు పోయిన బాధకన్నా ఎక్కువగా తనను బాధించేవి వేరే ఏమి లేవంటారు పి.ఎస్. నారాయణ.

## 1.2. బాల్యం - విద్యాభ్యాసం

పి.ఎస్. నారాయణ ప్రాథమిక పాఠశాల చదువంతా చినకాకానిలోనే సాగింది. పసితనంలోనే తండ్రి పోవడంతో తల్లే చదివించింది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన

సంవత్సరం మంగళగిరిలో ఫస్ట్‌ఫారం చదివారు. చినకాకాని నుండి రోజూ రెండు మైళ్ళు నడిచి ఆ స్కూలుకు వెళ్ళేవారు. ఫస్ట్‌ఫారం మధ్యలోనే తన తల్లితో మంగళగిరికి వచ్చేసారు. ఇక్కడ తల్లి చనిపోవడంతో, గుంటూరులోని తన అక్క తీసుకెళ్ళడంతో సెకండ్ ఫారం నుంచి బి.కాం. వరకు గుంటూరులోనే చదివారు. తరగతి గదిలో సాధారణ విద్యార్థి. "పాస్ మార్కులు వస్తే చాలు అన్నట్లుగా చదివేవాడిని. అలాగే చదువుకు ఎక్కడా విఘ్నం కలుగకుండా ప్రతి తరగతిలోనూ ఉత్తీర్ణుడనవుతుండే వాడిని. బాల్యంలో బొమ్మలు గీయడం అంటే చాలా ఉత్సాహంగా ఉండేది. నేను అయిదో తరగతి నుండే గీస్తూండేవాడిని"[6] అని చెబుతారు. పి.ఎస్. నారాయణ ఏడో తరగతి నుండి ఒక స్నేహితుడి ఇంటికి చందమామ కథల పుస్తకాలు వస్తుంటే తీసుకొని మొదటినుండి చివరిదాకా చదివేవారు. ఆ విధంగా కథలు చదవటం చిన్నప్పటినుంచే అలవాటయింది. ఆ అలవాటు ఆయన వ్యక్తిత్వ నిర్మాణానికి తోడ్పడిందని చెప్పవచ్చు. మంగళగిరిలోనూ, గుంటూరులో కూడా తాను ఎక్కువగా డ్రాయింగ్ మాష్టర్ల వెంట తిరుగుతుంటే, వాళ్ళు తనలోని ఉత్సాహాన్ని గమనించి ప్రోత్సహించేవారట. తర్వాత తనంతట తానే మధ్యలోనే బొమ్మలు గీయటం ఆపేశారు. "కళాశాల స్థాయిలోనే కాస్త రచనల మీద మమకారం ఏర్పడింది. దానికి కారణం హైస్కూల్‌లో చదువుతున్నప్పుడు శెలవుల్లో మా ఇంటికి దగ్గరలోనే వున్న సెంట్రల్ లైబ్రరీకి వెళ్ళి మ్యాగజైన్‌లు, పుస్తకాలు చదువుతుండేవాడిని"[7] అని అంటారు పి.ఎస్. నారాయణ. ముఖ్యంగా ఆంధ్ర సచిత్ర వార పత్రికలో తెలుగు నవలలతో పాటు ఆంగ్ల నవలలను అనువదింపచేసి ప్రచురించేవారు. అప్పుడే కాశీమజిలీ కథలు, భట్టి విక్రమార్కుడి కథలతో పాటు శరత్‌బాబు నవలలూ కళాశాల స్థాయిలోనే శ్రద్ధగా చదివేవారు. హిందూ కాలేజీలో మన్నవ గిరిధరరావు అనే ఆయన లెక్చరర్‌గా పనిచేసేవారు. అప్పటికే ఆయన పేరున్న రచయిత. ఆయనతో పరిచయం పి.ఎస్. నారాయణకు కథా రచనకు ప్రోత్సాహం ఇచ్చింది.

ఈ విధంగా పాఠశాల, కళాశాల స్థాయి నుంచే పఠనాసక్తిని పెంపొందించుకోవడంతో పాటు నిత్య నూతన విద్యార్థిగా సమాజాన్ని అధ్యయనం చేసి, ఉత్తమ రచయితగా ఎదగడానికి బలమైన పునాదులను ఏర్పరచుకున్నారు.

## 1.3. ఉద్యోగ జీవితం

1957లో పి.ఎస్. నారాయణ తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. మొదట రెవెన్యూ డిపార్టుమెంట్‌లో గుమాస్తాగా తాత్కాలికంగా ఉద్యోగంలో చేరారు. కొంతకాలం తర్వాత అదే గుమాస్తాగా మెడికల్ డిపార్టుమెంట్‌కు మారారు. ఆ రోజులలో ఉద్యోగ సంపాదనకు అంత కష్టపడవలసిన అవసరం ఉండేది కాదు. అందరూ నీతి, నిజాయితీగా ఉద్యోగం చేసేవారు. తాత్కాలిక గుమాస్తా ఉద్యోగం కాబట్టి లంచగొండితనం ప్రభావం తనపై పడలేదని భావిస్తారు పి.ఎస్. నారాయణ. తాత్కాలిక ఉద్యోగంలో రెండు సంవత్సరాలు కొనసాగారు.

1959లో గుంటూరులోనే జిల్లా ట్రెజరీలో సర్వీస్ కమీషన్ ద్వారా పర్మినెంటు గుమాస్తాగా ఉద్యోగమొచ్చింది. దీంతో అభద్రతా భావం పోయి ఆయనలో ధైర్యం వచ్చి కొత్త జీవితం మొదలైంది. అక్కడ నాలుగు సంవత్సరాలు ఉద్యోగాన్ని నిర్వర్తించారు. ఆయన స్వతంత్ర జీవితం కొనసాగించడానికి తను చేస్తున్న ఉద్యోగాలు తగినంత బలాన్నిచ్చాయి.

1963లో ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ హైదరాబాద్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. ట్రెజరీ ఉద్యోగానికి రాజీనామా చేసి హైదరాబాద్‌కు మకాం మార్చారు. ఆయన ఎక్కడ ఉద్యోగం చేసినా, తను ఎక్కడికి వెళ్ళినా సమాజాన్ని, మనుష్యుల్ని, వారి మనస్తత్వాల్ని గమనించడం, తన రచనకు కావలసిన ముడి సరుకును పట్టుకోవడమే ఆయన పని. దాదాపు ముప్పై సంవత్సరాలు అదే కంపెనీలో సీనియర్ ఎకౌంట్స్ ఎగ్జిక్యూటివ్‌గా చేసి 1993లో స్వచ్ఛంద పదవీ విరమణ పొందారు. ఆయన వ్యక్తిగత జీవిత నేపథ్యం, ఉద్యోగ జీవితం రచయితగా ఎదగడానికి, సాహిత్య జీవితంలోకి అడుగిడడానికి కారణమైందని చెప్పుకోవచ్చు.

## 1.4. రచయిత కుటుంబం

పి.ఎస్. నారాయణకు తన అక్కయ్య కూతురుతో, బి.కాం. చదువుతుండగా వివాహం జరిగింది. ఆమె పేరే మాధురి అన్నపూర్ణ. వీరికి ఒక అమ్మాయి, ఇద్దరు అబ్బాయిలు. అందరికి వివాహాలు జరిగాయి. మగపిల్లలు ఉద్యోగాలలో స్థిరపడ్డారు. ముగ్గురు మనవళ్ళు, ఇద్దరు మనవరాళ్ళు. వాళ్ళు చదువుకుంటున్నారు.

## 1.5. కుటుంబ వాతావరణం

బాల్యంనుండి పరిచితురాలైన మేనకోడలే భార్య కావడం పరస్పర అవగాహనకు తోడ్పడింది. వివాహ జీవితం ఒడిదుడుకులు లేకుండా సాగింది. రచయితగా జీవితం గడపడానికి తగినంత అవకాశం లభించింది. “నా భార్య సహకారం ఉండడం నన్ను రచయితగా ఎంతగానో నిలబెట్టింది. ఇంటి పనులు, పిల్లల చదువులు ఆమే చూసుకునేది.”[8] అని చెప్పారు పి.ఎస్. నారాయణ. కుటుంబపరంగా జీవితంలో ఎటువంటి ఒడిదుడుకులు లేవు. ఉద్యోగం ఉండటంతో తనకు ఆర్థికపరంగా ఎటువంటి ఇబ్బందులకు తావు లేదు. తను ఎక్కువగా మిత్రులతో తిరగడంతోనే సమయమంతా గడిపేవారు. అలాగే తన రచనా వ్యాసంగానికి కుటుంబ సభ్యులు, మిత్రుల సహకారం ఎంతగానో ఉండేది. సమాజాన్ని పరిశీలిస్తూ, సమస్యలను ఆకళింపు చేసుకునేవారు. దానికి వాస్తవ సంఘటలనూ జోడిస్తూ పాత్రల సృజనతో పాఠకుడికి చక్కని ముగింపుతో కూడిన రచనలు అందించారు.

## 1.6. సాహిత్య బీజాంకురం

హిందూ కళాశాలలో చేరిన తర్వాత లెక్చరర్ మన్నవ గిరిధరరావు గారితో పి.ఎస్. నారాయణకు పరిచయం పెరిగింది. “ఓ రోజు వారితో నాకు కథలు రాయడం నేర్పండి అన్నాను. అదేం బ్రహ్మవిద్య కాదు. ఓ పది ఇంగ్లీషు కథలు తెలుగులోకి తర్జుమా చెయి.... నువ్వు పదకొండో కథ స్వంతంగా రాయగలుగుతావు అన్నారు.”[9] అనువాదం చేయటం వలన కథ ఎలా మొదలుపెట్టాలి, ఎలా ముగించాలో లాంటి మెలుకువలు తెలుస్తాయని ప్రముఖ రచయిత గిరిధరరావు చెప్పటంతో కథలు అనువదించటం మొదలు పెట్టారు. ఆ కథలను గిరిధరరావు చదివి తగిన సూచనలు, సలహాలను పి.ఎస్. నారాయణకు ఇచ్చేవారట. తరువాత గిరిధరరావు పి.ఎస్. నారాయణ ఇంటికి దగ్గరలోనే ఉండడం వలన తరుచు వాళ్ళింటికి వెళ్తుండటం జరిగేది. అందువల్ల ఆయన ఇచ్చే ప్రోత్సాహంతో కథ రాయటంలోని మెలుకువలు తెలుసుకొని మెల్లమెల్లగా కథలు రాయడం మొదలుపెట్టారు పి.ఎస్. నారాయణ.

## 1.7. తొలిచూలు 'స్వం... నాస్తిః'

1957లో పి.ఎస్. నారాయణ తన మొదటి కథను రాసారు. ఆ తొలినాళ్ళ తొలిచూలు కథ 'స్వం.. నాస్తిః'. ఇది గుంటూరు పత్రికలో అచ్చయింది. తొలి రోజుల్లో 'మాధురి' కలం పేరుతో కథలు రాసేవారు. అట్లాగే చాలాకాలం వివిధ కలం పేర్లతో ప్రజావాణి, చిత్రగుప్త, ప్రజామత, కృష్ణా పత్రికలలో రాసేవారు. 'మాధురి' అన్న కలం పేరు ఎక్కువగా వాడేవారు. తన భార్య పేరు మాధురి అన్నపూర్ణ కావడం విశేషం. "1962లో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక వారు నా మొదటి కథను ప్రచురిస్తూ 'మాధురి' అనే పేరున పంపినా 'పి.ఎస్. నారాయణ' పేరుతో ప్రచురించారు. అది నా చిరునామాలో ఇచ్చిన పేరు. నా పూర్తి పేరు పొత్తూరి సత్యనారాయణ. అప్పటినుంచి నేను పి.ఎస్. నారాయణ పేరుతోనే కథలు రాస్తున్నాను."[10] అదే తన అసలు పేరు, కలం పేరు అయ్యిందని పి.ఎస్. నారాయణ భావిస్తారు.

తన మొదటి కథ ప్రచురణ కంటే ముందు చాలాకాలంపాటు తన కథలు తరచూ తిరిగివస్తుండేవి. తన మిత్రుడైన తారకరామారావు రాసిన కథ ఒకటి ఆంధ్రపత్రికలో వచ్చింది. అప్పట్లో ఆంధ్రపత్రికలో కథ ప్రచురితం కావటం గొప్ప విశేషమే. అది చూసిన వెంటనే ఆయనను కలిశారు ఆయన తన కాలేజిమేటు. తన ప్రాథమిక విద్యలో వాళ్ళ నాన్నగారే తన గురువు. అతని దగ్గరికెళ్ళి తన కథలు పత్రికల నుంచి తిరిగొస్తున్నాయని, అచ్చు కావాలంటే ఏం చేయాలని వారిని అడిగారట. ఆయన నవ్వేసి ఒక ఫార్ములా చెప్పారు. దాంతో 'గెలుపు నీదే' అనే కథ రాసి ఆంధ్రపత్రికకు పంపారట. అది మూడు వారాల్లో 'నేను ఓడిపోయాను' అనే పేరుతో సెంటర్ పేజి అంతా బొమ్మతో వచ్చింది. "అప్పటినుంచి ఇక తిరిగి చూసుకునే అవసరం లేకుండా పోయింది. వరసగా కథలు రాస్తూనే ఉన్నాను. ఇప్పటికి 230కి పైగా కథలు, 31కి పైగా నవలలు, పది దాకా రేడియో నాటికలు, రెండు స్టేజి నాటికలు రాశాను"[11] అని చెప్పే నిరంతర కథల కాణాచి పి.ఎస్. నారాయణ. 'మనసుంటే మార్గముండదా' అనే సామెతను గుర్తుకు తెస్తారు. ఇంతటి విస్తృత సాహిత్య సృజన ఆయనకే సొంతం.

## 1.8. పి.ఎస్. నారాయణ వ్యక్తిత్వం - సాహిత్య ప్రభావం

ఆలోచనలనేవి నిద్ర లేచిన ఆత్మకు అంతఃసాక్ష్యాలు. ఆలోచలు వస్తూపోతూ ఉంటాయి. వాటిని ఒకచోట చేర్చి ఆకృతిని కల్పించే శిల్పి రచయిత. ఊహాజగత్తును వదిలి వాస్తవికతకు దగ్గరగా కథలల్లే పి.ఎస్. నారాయణ వ్యక్తిత్వం ఆయన సృజించే రచనలలోని పాత్రలలో దర్శనమిస్తుంది. తన వద్ద విషయం ఉన్నా మంచి ముగింపు దొరక్క సంవత్సరాల తరబడి రాయకుండా ఆపిన కథలున్నాయి. మంచి ముగింపు ఉంటే కథను అద్భుతంగా సృష్టించగలం అనేది ఆయన నమ్మకం. ఆయనకు మన సంస్కృతి పట్ల ఎంతో గౌరవం. తన రచనల్లో మధ్యతరగతి కుటుంబాలు, ఆ కుటుంబాల్లోని మహిళలు, వారి సామాజిక సమస్యలే ప్రధాన ఇతివృత్తాలుగా ఉంటాయి. ఆయనెప్పుడు సమాజాన్ని అధ్యయనం చేసే కథాశిల్పి. నిత్య విద్యార్థి.

ఆయన తన గురించి ఈ విధంగా చెప్తారు. "స్వతహాగా నేను మితభాషిని. చదువుకోవడం, రాసుకోవడం ఇష్టపడతాను. నా కథల్లోని పాత్రలు కూడా నాలానే ఉంటాయి. నా కథల్లోని పాత్రలు ఎక్కడా గొంతు చించుకొని అరవవు. వికృత చేష్టలు చేయవు. సమాజంలో కసి, ద్వేషం, పగ, ప్రతీకారాలున్నాయి. అలాంటి పాత్రలు నా కథల్లో ఉన్నప్పటికీ ఎప్పుడూ

హద్దులు దాటవు. రచయితగా కీర్తి గడించటం కోసం కథల్లో జిమ్మిక్కులు చేయడం నాకు ఇష్టం ఉండదు."[12].

హైస్కూల్ నుండే పుస్తక పఠనంపై చాలా ఆసక్తిని కనబరచేవారు పి.ఎస్. నారాయణ. కళాశాల స్థాయిలో కూడా మ్యాగజైన్‌లు, పుస్తకాలు చదివేవారు. ముఖ్యంగా ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ఆంగ్ల నవలలను అనువదింపచేసి హకల్ బెరీఫిన్ టామ్‌సాయర్, రెండు మహానగరాలు లాంటివి ఆ రోజుల్లో ప్రచురించేవారు.వాటిని ఎంతో ఉత్తేజంగా చదువుతుండేవారాయన. "శరత్‌బాబు నవలలూ చదవడం మొదలయింది. హిందూ కళాశాలలో చేరిన తరువాత లైబ్రరీ నుంచి నవలలు, కథాసంపుటాలు తీసుకువచ్చి చదువుతుండే వాడిని"[13] అని పేర్కొంటారాయన. తర్వాత విస్తృత అధ్యయనంతో పాటు సమకాలీన పరిస్థితులు సమాజాన్ని అర్థం చేసుకుంటూ రచనలు చేస్తూ వచ్చారు. నైతికత విషయంలో తాను రాజీపడిన సందర్భాలు మాత్రం లేవని నైతికంగా పతనమయిన పాత్రలను చిత్రించినా, వాటిని తాను సమర్థించలేదంటారు. నీతి, నిజాయితీ, నిరాడంబరతతో సాధారణంగా కనిపించే అసాధారణమైన, మహోన్నతమైన వ్యక్తిత్వం కలవారు.

ప్రతి రచయిత ఇతర రచయితల రచనలను చదువుతాడు. పి.ఎస్. నారాయణ ఎంతోమంది రచయితల రచనలను చదివినా వారి సిద్ధాంతాలు, వారి రచనల శైలి వంటి అంశాల ప్రభావం తనమీద అంతగా లేదనే అంటారు. పాత తరానికి , కొత్త తరానికి ఆయన వారధి. ఆయన దారి వేరు. కాలాన్ని శాసిస్తూ నిరంతర అక్షర యజ్ఞం చేయటం ఆయనకే చెల్లుతుంది.

## 1.9. సమకాలీన రచయితలు - సహకారం

కాల పరిణామక్రమంలో రచయితలు జనిస్తారు. ఆ రచయిత రచయితగా కొంతకాలం మనగలగాలంటే సహజ శైలీ, సృజనతో పాటు సమకాలీన రచయితల సహకారం అవసరం. తనకు ఆత్మీయ మిత్రుడు కాకాని చక్రపాణి. "నేనూ కాకాని చక్రపాణి అన్నా చెల్లెలి బిడ్డలం. మాది ఒకే ఊరు. చిన్నప్పటినుంచీ ఎంతో ఆత్మీయంగా తిరిగాం. నేను కథలు రాయటం మొదలుపెట్టినప్పటినుంచీ చాలా వాటికి చక్రపాణి మెరుగులు దిద్దాడు"[14].

పి.ఎస్. నారాయణకు సామాన్యంగా మిత్రులెక్కువ. రచయితల్లోను ఈయనకు చాలామంది మిత్రులున్నారు. వారిలో శ్రీసుభా, కవిరాజు, పాలకోడేటి, డి. చంద్రశేఖర్ రెడ్డి, గోవిందరాజు చక్రధర్, దత్త ప్రసాద్ పరమాత్ముని, మల్లాది వెంకట కృష్ణమూర్తి మొ॥న వారున్నారు.

తాను రాస్తున్న కథ ఎక్కడ ఆగిపోయినా మిత్రుల సలహా తీసుకోవడం ఆయనకి అలవాటు. దానివలన కొత్త ఆలోచనలకు అవకాశముంటుందనేది పి.ఎస్. నారాయణ అభిమతం. "నేనూ ప్రముఖ కవిరాజు గారు మరియు ప్రముఖ రచయిత కీ॥శే॥ శ్రీ సుభా పాతిక సంవత్సరాలకు పైగా ఐడిపియల్‌లో కలిసి పనిచేసాం. ఆత్మీయంగా మెలిగాం. మాకు రచనలు, పుస్తకాలే వ్యాపకం. ఎప్పుడు కలిసినా వాటి గురించే చర్చ... ఎక్కడ సాహితీ సదస్సు వున్నా మేం తయారు..."[15]

## 1.10. రచయితగా పొందిన పురస్కారాలు

ఆంధ్రప్రభ వారపత్రికలో 1962లో దీపావళి కథల పోటీలో 'శిక్ష' అనే కథకు, 1966లో ఉగాది నవలల పోటీలో 'మిథ్యాబింబాలు' అనే నవలకు, 1987లో నవలల పోటీలో

‘భోగమందిరం’ అనే నవలకు ద్వితీయ బహుమతులు లభించాయి.

1976లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో నిర్వహించిన నవలా ప్రియదర్శిని నవలల పోటీలో ‘కీరవాణి’ అనే నవలకు బహుమతి లభించింది.

స్వాతి మాసపత్రికలో 1999లో పది వారాల సీరియల్ నవలల పోటీలో ‘నాకు పది రోజులు చాలు’ అనే నవలకు, 1985లో ‘కొత్త పులి’ అనే కథకు ప్రోత్సాహక బహుమతులు లభించాయి.

రచన మాసపత్రికలో 2000లో ‘చిన్న కోరిక’ అనే కథకు కాశీభొట్ల హనుమాంబ స్మారక కథల పోటీలో ప్రత్యేక ప్రశంస లభించింది. 2003లో ‘రేపటి ఆలోచన’ అనే కథ, యడ్లపాటి వెంకట సుబ్బారావు స్మారక పోటీకి ఎన్నికై, కథావాహినిలో ప్రచురితమయింది. 2004లో రాసిన ‘స్వేచ్ఛ’ అనే కథ యడ్లపాటి వెంకట సుబ్బారావు స్మారక పోటీలో ఉత్తమమైన కథగా ఎన్నికై అదే సంవత్సరం కథావాహినిలో ప్రచురితమయింది. 2004లో ‘అమృత తిలకం’ అనే కథకు డా॥ ఉన్నవ గోపాలకృష్ణ (రవి) స్మారక కథల పోటీలో బహుమతికి ఎన్నికై, ఆగష్టు 2004 సంచికలో ప్రచురితమయింది. 2005లో ఇదే కథ, యడ్లపాటి వెంకట సుబ్బారావు కథల పోటీలో ఉత్తమమైన కథగా ఎంపికై కథావాహిని 2005లో ప్రచురితమయింది.

ఈనాడు ఆదివారం అనుబంధ సంచిక 25.11.2001లో, దేవరాజు వెంకట కృష్ణారావు 116వ జయంతి సందర్భంగా 2001 సంవత్సరంలో ప్రచురితమైన ఆశ్రయం అనే కథకు ఉత్తమ కథగా స్వర్ణపతకం వచ్చింది.

ఇండియాటుడే వారపత్రికలో 1997లో ప్రచురితమైన ‘అజ్ఞాత శత్రువు’ అనే కథ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలుగు కథ 1997కు ఎన్నికైంది.

ఆంధ్ర సచిత్ర వార పత్రికలో 29.11.1968 సంచికలో ప్రచురితమైన ‘ఎంతదూరమీ రాత్రి’ అనే కథ, 1968 సంవత్సరంలో వివిధ పత్రికలలో ప్రచురితమైన కథలలో ఉత్తమ కథగా గుర్తించడంతో పాటు యం. శేషాచలం అండ్ కో వారి ‘1968 కథానికలు’ అన్న సంకలనంలో తిరిగి ప్రచురణ పొందింది.

ఆంధ్రభూమి దిన పత్రికలో వ్యయనామ సంవత్సరంలో (2006) ఉగాది నవలల పోటీలో ‘ఓ సూర్యుడు ఒక వెన్నెల’ అనే నవలకు తృతీయ బహుమతి లభించింది.

## 1.11. పి.ఎస్. నారాయణ కాలం నాటి సామాజిక సాహిత్య నేపథ్యం

పి.ఎస్. నారాయణ జన్మించే నాటికి ప్రపంచ ఆర్థిక మాంద్యం ప్రభావం భారతదేశాన్ని పట్టి పీడిస్తుంది. 1947లో స్వాతంత్ర్యం వచ్చేవరకు ప్రతి ప్రాంతం జాతీయ ఉద్యమంలో తలమునకలై ఉంది. స్వాతంత్ర్యం వచ్చే సమయానికి పి.ఎస్. నారాయణ వయసు చిన్నది కావటం వల్ల దాని ప్రభావం ఆయనపై లేదు. అందువల్ల రచయితగా పి.ఎస్. నారాయణ కలం పట్టే సమయంలోని సామాజిక సాహిత్య వాతావరణాన్ని తెలుసుకోవలసి వుంది. ఆ వాతావరణం ఆయనపై ఏ విధమైన ప్రభావం చూపిందో ఈ అంశం ద్వారా తెలుసుకోవచ్చు.

1957-1958 ప్రాంతంలో పి.ఎస్. నారాయణ రచనా వ్యాసంగం ప్రారంభమైంది. ఈ కాలంలోని సామాజిక స్థితి ఈ విధంగా ఉంది. “1950-1958లో ఎయిడ్ ఇండియా కన్సోర్టియం ఏర్పడింది. ప్రభుత్వం స్వయంసమృద్ధి లక్ష్యాన్ని ప్రకటిస్తూ ఉన్నా విదేశీ సహాయమూ,

ఋణాలూ ఇమ్మడి ముమ్మడిగా పెరగడం ప్రారంభమయింది. విదేశీ సహాయంలో ఎప్పుడూ అమెరికా వంతే ఎక్కువ. 1957-58 నుండి ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధులు ప్రత్యక్ష్య జోక్యం ప్రారంభమయింది. విదేశీ కంపెనీల సంఖ్య శాఖోపశాఖలుగా విస్తరించింది. నిరుద్యోగం విజృంభించింది. ఆహార పదార్థాల కొరత ఏర్పడింది. గ్రామీణ జనాభాలో 40%, నగర జనాభాలో 50% దారిద్ర్య రేఖకు దిగువకు చేరుకున్నారు. భూదానోద్యమాలూ, భూసంస్కరణలూ కంటి తుడుపు చర్యలే తప్ప భూమిలేని పేదలకు ఏ ప్రయోజనమూ కలుగలేదు. 1950-51, 1968-69 మధ్యకాలంలో వ్యవసాయ కూలీల జీతాల విలువలో ఎటువంటి పెరుగుదల లేదు. గ్రామీణ ప్రాంతాలలో భూస్వాముల దౌర్జన్యాలు పెరిగాయి. పేద ప్రజల అసంతృప్తిని అణచడానికి లాఠీలు, తూటాలూ ఉపయోగించవలసి వచ్చింది. 1966 నాటికి దేశంలో అనేక ఉద్యమాలు చెలరేగాయి."[16] ఈ విధంగా ఆనాటి సామాజిక పరిస్థితి సమస్యలతో ఉక్కిరిబిక్కిరవుతుంది.

స్వాతంత్ర్యానంతరం సమాజ జీవన సరళిలో వున్న చీకటి తొలగిపోయి వెన్నెల వెల్లివిరుస్తుందన్న మాట నిజం కానీ అది అంతగా నిలువలేదు. "నిత్య జీవితాలలో తగిన శాంతి లభించలేదు. అధిక ధరలను తట్టుకోవడం సులభ సాధ్యం కాలేదు. వివాహాల సమస్య ప్రతిబంధన రూపం దాల్చింది. ఉద్యోగ సమస్య ఉక్కుముక్కలతో కోలాటంగా తయారైంది. ఇలాగే ఎన్నో గృహస్థ వాతావరణంలో సంచలనం కల్పించే సంఘటనలు ఏర్పడినాయి."[17] దీనివల్ల సామాన్య ప్రజలు వారి జీవన విధానం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నట్లుగా తెలుస్తుంది. యజమానులు మారారని అర్థమవుతుంది. నగర జీవితంలోకి 1963 ప్రాంతంలో అడుగుపెట్టిన పి.ఎస్. నారాయణని ఈ సమస్యలు ఆకర్షించాయి. సమాజ పరిశీలనా దృష్టి తనలోని రచయితను పురికొల్పాయి.

1957లో పి.ఎస్. నారాయణ రచయితగా మొదటి కథను ప్రచురించే సమయానికి సాహిత్యంలో కొన్ని రకాల వస్తువులతో రచనలు వస్తున్నాయి. ముఖ్యంగా కొన్ని భావాలకు ప్రచార సాధనాలుగా నవలలు రాస్తున్నారు. "వీటిలో ఎక్కువ ప్రచారము పొందుతున్నది సామ్య సమాజ వ్యవస్థ. ఈ నవలలో ధనికులు కేవలం రాక్షసులుగాను, పేదలు దేవతలుగాను వర్ణింపబడుతున్నారు. వర్ణభేదము నశించవలెననే ఆశయం వల్ల వర్ణాంతర వివాహాల కష్టసుఖాలు చిత్రించే నవలలు వస్తున్నాయి. స్వాతంత్ర్యము రాకముందు త్యాగమూర్తులుగా ప్రవర్తించిన వ్యక్తులే నేడు అధికారము చేతికిరాగానే స్వలాభమూ, స్వాశ్రిత పక్షపాతమూ ప్రదర్శించడము కథావస్తువవుతుంది. యువతులు, యువకులతో పాటు ఉన్నత విద్యలు అభ్యసించడము వల్ల ఉత్పన్నమవుతున్న నైతిక సమస్యలు - ఇవే ఎక్కువ భాగము కథా వస్తువులు"[18]. పి.ఎస్. నారాయణ రచనలలో కూడా పైన పేర్కొన్న అన్ని కోణాలు కాకపోయినా కొన్ని కొన్ని కోణాల్లో నవలలు, కథలు కన్పిస్తాయి.

రచయితగా పి.ఎస్. నారాయణ వయస్సు పెరుగుతున్న కొద్ది ఆయన ఆలోచన సరళి మార్పు చెందుతూ వచ్చింది. అదేవిధంగా ఆయన సృజనాత్మక రచనల సంఖ్య పెరిగింది. దిన, వార, మాస పత్రికలలో ఆయన నవలలు, కథలు ధారావాహికలుగా ప్రచురితమయ్యేవి. స్వాతి, నవ్య, ఇండియాటుడే, ఆంధ్రభూమి, వార, పక్ష మాస పత్రికలలో, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, జ్యోతి, అప్సర, యువ తదితర దిన పత్రిక, మాస పత్రికలలో తరచుగా ప్రచురితమయ్యేవి.

ఇంతటి విస్తృత పరిధిలో ప్రచురింపబడిన పి.ఎస్. నారాయణ రచనలను నవలలు, కథలు, నాటికలు అని విభజించుకొని స్థూలంగా పరిశీలిద్దాం.

## 1.12. పి.ఎస్. నారాయణ రచనలు

పి.ఎస్. నారాయణ రచనలు వచనంలోనే వచ్చాయి. కవిత్వం రాసిన జాడలు లేవు. కథ, నవల, నాటిక ప్రక్రియలు త్రిముఖ రచనలుగా కన్పిస్తాయి.

### 1.12.1. సృజనాత్మక రచనలు

రచయిత కథను సృష్టించడానికి సృజనాత్మకత అవసరం. ఏ రంగం అయినా ఎంతో కొంత సృజనాత్మకతను కోరుకుంటుంది. ఒకరు చేసిన పనినే మరొకరు చేసినా అందులో ఎంతో కొంత నూతనత్వాన్ని ప్రదర్శిస్తారు. చాలామంది రచయితలు ఒకే వస్తువును తీసుకొని కథలల్లినా దానిలో రచయిత సృష్టిని బట్టి కొత్తదనం చోటుచేసుకుంటుంది. దానికి కారణం వారి వారి సృజనాత్మకత అని చెప్పవచ్చు. సాహిత్యలోకంలో ఒకటి గొప్ప రచనగా మరొకటి మామూలు రచనగా గుర్తింపు పొందడానికి కారణం ఆ రచనలోని సృజనాత్మకతలోని తేడాయే. రచయిత కొన్ని పాత్రలను సృజించినప్పుడు సృజనాత్మకత వలన అందులోని ఏదో ఒక పాత్రకు మాత్రమే గుర్తింపు వస్తుంది. అది రచయిత సృజనాత్మకతకు అద్దం పడుతుంది. అందువల్లనే ఆ పాత్రను ఆదరిస్తాం. పి.ఎస్. నారాయణ కథల్లోని పాత్రలు కొన్ని పాఠకునికి చిరకాలం గుర్తుండేటట్లుగా మదిలో మెదలుతాయి. సృజనాత్మకత అన్నది రచనకు ప్రాణం. సృజనాత్మకత అంటే ఏమిటి?

“ఇంగ్లీషులో క్రియేటివిటీ అనే మాటకు సమానార్థకంగా తెలుగులో సృజనాత్మకత అనే పదాన్ని వాడుతున్నాం. మానవ జీవితంలో అన్ని రంగాల్లోను ఆలోచనలలోను క్రియేటివిటీ వుంటుంది. విశ్వ రహస్య శోధనలకు చేసే ప్రతిపాదనలకు, ఒక భాషా వ్యాకరణం రాయటానికి సర్వభాషా సామాన్య ప్రతిపాదనలు చేయటానికి సాహిత్య విమర్శకు ఒకటేమిటి అన్ని రకాల మానవ విజ్ఞాన శాఖలకు క్రియేటివిటీ కావాలి”[19]. అన్న చేరా గారి అభిప్రాయం సృజనాత్మకతకున్న ప్రాధాన్య పరిధిని చెబుతుంది. కాగా Creativity - Creative అన్న మాటలకు విజ్ఞాన సర్వస్వాలు చెబుతున్న నిర్వచనాన్ని పరిశీలించవచ్చు.

"The ability to make or otherwise bring into exstence something new whethere a new solution to a problem a new method or device or a new artistic object or a form"[20] అని ఆంగ్ల విజ్ఞాన సర్వస్వాలు చెబుతున్నాయి.

కొత్త కోణంలో రచనలను నిర్మించడం సృజనాత్మకత. సందర్భాన్ని అనుసరించి దీని పరిమితులను నిర్ణయించవచ్చు. “కావ్య సంసారాన్ని సృష్టించే కవిని సృష్టికర్త అయిన బ్రహ్మతో పోల్చడం భారతీయ లాక్షణికులలో ఉంది. ఈ అంశాన్ని ఆధారం చేసుకొని సాహిత్య సృజనాత్మకత చేసే వ్యక్తిని సృష్టికర్తగా చెప్పడం సాహిత్యలోకంలో ప్రసిద్ధంగా ఉందని తెలుస్తుంది.”[21] కాగా కవి / రచయిత సృష్టించిన ప్రతిదీ సృజనాత్మకమేనా అని ఆలోచించవలసి వచ్చినప్పుడు ఆయా సందర్భాలను అనుసరించి పరిమితులను నిర్ణయించుకోవలసి ఉంది. ఆ పరిమితులనే విజ్ఞాన సర్వస్వం చెబుతుందని భావించాలి.

ఏదైనా ఒక అంశాన్ని, విధానాన్ని ప్రక్రియను కళాప్రక్రియను కొత్త పద్ధతిని కనిపెట్టడం లేదా కొత్త పద్ధతిలో ఆవిష్కరించడం సృజనాత్మకత అని పై నిర్వచనం స్పష్టం చేస్తుంది. ఈ

కొత్త పద్ధతిలో ఆవిష్కరించడాన్ని భారతీయ ఆలంకారికులు అపూర్వ వస్తు నిర్మాణ క్షమ అని చెప్పి ప్రతిభ అని దానికి పేరు పెట్టారు. ఈ ప్రతిభ ఆధారంగానే రచయిత సృజనాత్మకత తెలుస్తుంది. చేరా మాటలు, విజ్ఞాన సర్వస్వ నిర్వచనం సృజనాత్మకతలోని బహు ముఖ కోణాలను ఆవిష్కరించాయి. ఈ రెండింటి ఆధారంగా కళా ప్రక్రియ అందులోని వస్తువు పాతదైనా దానిలో నూతనత్వాన్ని ప్రదర్శిస్తే సృజనాత్మకత అవుతుంది.

రచయిత స్వంతంగా తానూ తన భావాలను తనదైన శైలిలో వ్యక్తం చేయడానికి ప్రయత్నిస్తారు. ఇవి తొలి అడుగులు మాత్రమే. తర్వాత తానొక ఇతివృత్తాన్ని ఎంచుకొని తదనుగుణంగా పాత్రలను సృజించి కథను భిన్నమైన రీతిలో వెల్లడించడంలో సృజనాత్మకతను చూపుతాడు. పి.ఎస్. నారాయణ ఎంచుకున్న కళ ప్రక్రియ, విషయం రెండు పాతవి. తానెంచుకున్న ప్రక్రియలో వున్న పాత్రలు పాతవే. కాని ఆ పాత్రల ఆలోచనలను నూతన కోణంలో ఆవిష్కరించడం ద్వారా సృజనాత్మకతను చూపారు.[21] "పాత ఆలోచనలకు సంబంధించిన అంశాలను నూతన కోణంలో ఆవిష్కరించే ప్రయత్నం చేశారు.[22] పి.ఎస్. నారాయణ నూతన ప్రక్రియలను సృష్టించలేదు. కాని ఉదాత్తమైన పాత్రల సృజనలో తనదైన ముద్రను వేసి, కథలను రచించి పాత్రల ఆలోచనలలో నూతనత్వాన్ని సాధించి తన సృజనాత్మకతను చాటుకున్నారు. రచయిత సృష్టించిన ప్రతి రచన సృజనాత్మకమైనదే అవుతుంది. అందువల్లే పి.ఎస్. నారాయణ రచనలను నవలలు, కథలు, నాటికలు అని విభజించుకొని పరిశీలిద్దాం.

## 1.12.2. నవలలు

**1.12.3. రాగమయి :** 02 డిసెంబర్ 1962 నుంచి 23 జూన్ 1963 వరకు ప్రజామత సచిత్ర వార పత్రికలో ఇరవై ఎనిమిది వారాల పాటు ధారావాహికంగా ప్రచురితమైన నవల రాగమయి. రాగిణి అనే యువతి జీవితాన్ని తీసుకొని చిత్రించిన నవల. ఆమె జీవితంలో అనుకున్నవన్నీ దక్కకపోగా, తాగుబోతు, స్త్రీలోలుడైన భర్త దొరకడం, చివరికి అతను కూడా ప్రమాదంలో మరణించడం ఆమె జీవితాన్ని అంధకారబంధురం చేస్తుంది. ఇక చతికిలపడి శేషజీవితాన్ని కాశీ ఆశ్రమంలో గడపడానికి వెళ్ళడంతో నవల ముగుస్తుంది. ఈ నవలకు రాగమయి అని పేరు పెట్టడంలో రచయిత నేర్పు కన్పిస్తుంది.

**1.12.4. మిథ్యబింబాలు :** 22 సెప్టెంబర్ 1965 నుంచి 26 జనవరి 1966 వరకు ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రికలో దాదాపు పదిహేను వారాల పాటు ధారావాహికంగా ప్రచురితమైన నవల ఇది. జమీందారీ వాసన వున్న ఊరి వాతావరణంలో నడిచే ప్రేమ కథ. ఇందులో సారథి కథానాయకుడు. మైత్రేయి నాయిక. వీరిద్దరు ఒకరినొకరు ప్రేమించుకుంటారు. అలాగే కొంతకాలం గడుస్తుంది. తర్వాత వీరిమధ్య మనస్పర్థలు వచ్చి దూరమవుతారు. దీనికి కారణం నాయిక తండ్రి. ఆ నిజాన్ని ఆమె తెలుసుకుంటుంది. తన తండ్రి మాటలు నమ్మి తను సారథి పట్ల ప్రవర్తించిన తీరుకు సిగ్గుతో అతని ముందు తలవంచుకుంటుంది. ఎట్టకేలకు వారు తమ ప్రేమను గెలిపించుకోవడంతో నవల ముగుస్తుంది.

**1.12.5. మేఘమాల :** 23 జనవరి 1970 నుంచి 10 ఏప్రిల్ 1970 వరకు ఆంధ్రపత్రిక సచిత్ర వార పత్రికలో ధారావాహికంగా ప్రచురితమైన నవల ఇది. అన్నా చెల్లెలు బంధం గురించిన కథ. త్యాగరాజు, రాణి ఇద్దరు అన్నా చెల్లెలు. అతను తన చెల్లెల్ని చిన్నప్పటినుంచి పెంచి పెద్ద చేస్తాడు. అతనిని కాదని ఆమె తను ప్రేమించిన వాడితో పెళ్ళి చేసుకుంటుంది.

అతను చెల్లెలు లేదన్న బాధతో ఊరును విడిచి నగరాన్ని చేరుకుంటాడు. అతను చెల్లెలి పట్ల మొండివైఖరితో కొంతకాలం ప్రవర్తిస్తాడు. చివరికి అతని ప్రియురాలి వల్ల, స్నేహితుని భార్య వల్ల అతనిని అభిమానించే ఓ యువతి వల్ల ఆ అన్నా చెల్లెలు కలిసిపోవడంతో నవల ముగుస్తుంది.

**1.12.6. గాజు పల్లకి :** 1975లో స్వాతి మాస పత్రికలో అనుబంధ నవలగా ప్రచురించబడిన నవల ఇది. ఇందులో ప్రధాన పాత్ర మల్లికది. ఈమె ప్రేమించిన వ్యక్తి చేతిలో మోసపోవడమే కాక అతని వల్ల గర్భవతి అవుతుంది. ఆ సంఘటనతో దిగ్భ్రాంతికి గురవుతుంది. ఇక జీవితంలో ఎవరిని నమ్మలేక, నిలదొక్కుకోలేక ఆత్మహత్య చేసుకోవడంతో నవల ముగుస్తుంది. ఇలాంటి సంఘటనలు సమాజంలో జరగడం నిత్య సత్యం. ఇది విషాదాంత నవల.

**1.12.7. ధేనుక :** మార్చి 1976లో యువ మాసపత్రికలో ప్రచురితమైన నవల ఇది. ఇందులో ప్రధాన పాత్ర కాత్యాయినిది. ఈమె సమాజంలో భర్త మరణానంతరం జరిగే మూఢాచారాలమీద, ఛాందసభావాల మీద తిరుగుబావుట ఎగురవేస్తుంది. విజయం సాధిస్తుంది. ఈ తతంగం అంతా తన స్నేహితురాలికి జరగకుండా చూడడమే కాక సమాజానికి మార్గనిర్దేశం చేస్తుంది.

**1.12.8. కీరవాణి :** 14 మే 1976 నుంచి 11 జూన్ 1976 వరకు ఆంధ్రజ్యోతి వార పత్రికలో ధారావాహికంగా ప్రచురితమైన నవల ఇది. కథానాయకుడు రవిబాబు. ఇతను మానవతావాది. ఇతని ప్రభావంతో చెడు మార్గంలో వెళ్లిన అమృత మంచి మనిషిగా మారుతుంది. ఆమెను తన ఆత్మీయురాలిగా భావించుకుంటాడు. అందరిని కోల్పోయి జీవిస్తున్న శారదను తన చెల్లెలిగా భావించుకుంటాడు. పాటలు బాగా పాడే సరోజకు అభిమానిగా మారతాడు. తన అక్క కూతురు రాధను పెళ్లి చేసుకోవడంతో నవల ముగుస్తుంది.

**1.12.9. ఎంత దూరమీ రాత్రి ? :** సెప్టెంబర్ 1978లో ప్రభవ మాసపత్రిక సంచిక నవలా వాహినిలో అనుబంధ నవలగా ప్రచురితమైన నవల ఇది. నలుగురి స్త్రీల మనస్తత్వాలు, చిత్త వృత్తుల మధ్య సాగే నవల ఇది. రుక్మిణి, రాధ, శారద, అలాగే మరో స్త్రీ. ఒక్కొక్కరు ఒక్కో విధంగా ప్రవర్తించే స్వభావంతో కూడిన పాత్రలు. ఆధునిక సమాజంలో స్త్రీ చిత్తవృత్తికి ప్రతినిధులుగా ఈ పాత్రలను రచయిత చిత్రించారు.

**1.12.10. ఝుంఝూటి :** మే 1982 లో యువ మాస పత్రిక సంచికలో ప్రచురితమైన నవల ఇది. ముఖ్య పాత్ర వసంతది. చావుకు దగ్గరగా వున్న ముసలివాడు ఈమెకు భర్త. మరో ముఖ్య పాత్ర సత్యం. ఈయన అభ్యుదయవాది. వసంత జీవితాన్ని చూసి ఇతను బాధపడతాడు. ఆమెలో మార్పు రావాలన్నది అతని ఆశయం. దానిని సాధిస్తాడు. చివరికి తన ముసలి భర్త చనిపోతే ఆమె అధైర్యపడకుండా సత్యం ప్రభావం వల్ల తనకు జరిగిన అన్యాయాన్ని తెలుసుకొని ధైర్యంగా కొత్త జీవితాన్ని ప్రారంభించాలనుకోవటంతో నవల ముగుస్తుంది.

**1.12.11. క్షీరసాగర మథనం :** 25 సెప్టెంబర్ 1987 నుండి 26 ఫిబ్రవరి 1988 వరకు స్వాతి సపరి వార పత్రికలో ఇరవై మూడు వారాల పాటు ధారావాహికంగా ప్రచురితమైన నవల ఇది. మధ్యతరగతికి చెందిన రమణి, వసంత, భారతిల కథ. వీరి జీవితాలను కృష్ణమూర్తి అనే వ్యక్తి నాశనం చేస్తాడు. దాంతో వారు అతనిపై కసి పెంచుకొని ప్రతీకార దాహంతో

ఊగిపోతుంటారు. అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని ఆ దుర్మార్గుని అంతమొందించడంతో నవల ముగుస్తుంది.

**1.12.12. భోగమందిరం :** 17 ఫిబ్రవరి 1988 నుంచి 15 జూన్ 1988 వరకు ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రికలో పదిహేడు వారాలపాటు ధారావాహికంగా ప్రచురితమైన నవల ఇది. ఈ సమాజం బలవంతంగా ఓ ఇల్లాల్ని వ్యభిచారంలోకి నెట్టివేయబడిన కథ. వినయమూర్తి, భారతిలు ప్రధాన పాత్రలు. వీరిద్దరి మధ్య నెల రోజులు కాంట్రాక్టు కుదురుతుంది. కాని వీరిమధ్య ఎలాంటి సంబంధం ఉండదు. కృష్ణమూర్తి పరోక్షంగా ఆమె వ్యక్తిత్వాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తాడు. ఆ ప్రయత్నంలో ఆమె తనతో పాటు కాలేజీలో చదివిన భారతే అని, అలాగే తన స్నేహితుడే ఆమె భర్త అని, అతను ప్రమాదవశాత్తు అవిటివాడయ్యాడని తెలుస్తుంది. వినయమూర్తి జరిగినదానికి బాధపడి వారికి సహాయపడాలనుకుంటాడు. కాని ఆత్మాభిమానం కలిగిన భారతి తన భర్తను తీసుకొని ఊరు విడిచి వెళ్ళడంతో నవల ముగుస్తుంది.

**1.12.13. పిడికెడు నిశ్శబ్దం :** సెప్టెంబర్ 1997లో స్వాతి మాసపత్రికలో అనుబంధ నవలగా ప్రచురితమైన నవల ఇది. ఇందులో అమూల్య, కాళిదాస్ ప్రధాన పాత్రలు. అమూల్య ప్రేమించిన వ్యక్తి కారు ప్రమాదంలో చనిపోతాడు. అంతకుముందే వాళ్ళింట్లో వారు కాళిదాసుకు తననిచ్చి పెళ్ళి చేయాలనుకుంటారు. అతనిని చూడకముందే నిరాకరిస్తుంది. ప్రమాదం జరిగిన తర్వాత ఒంటరైన తనను చేరదీస్తాడు కాళిదాసు. ఆవిధంగా అతనితో అలా ఉండటం సమాజం తప్పుగా భావించి సూటి పోటి మాటలతో అందరామెను హింసిస్తారు. ఇలా అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని చివరికి వాళ్ళిద్దరు ఒకటవటంతో నవల ముగుస్తుంది.

**1.12.14. కొత్త గాలి :** 6 మార్చి 2000 నుంచి 21 ఏప్రిల్ 2000 వరకు ఆంధ్రభూమి దినపత్రికలో నలభై ఏడు రోజుల పాటు ప్రచురితమైన నవల ఇది. సంప్రదాయ కుటుంబ నేపథ్యంగా సాగే నవల. నీలకంఠమూర్తి ఆ ఇంటి యజమాని. అతను సంప్రదాయ భావజాలానికి ప్రతినిధి. వాటిని పాటించడంలో చండశాసనుడు. ఆ ఇంటికి కోడలిగా వచ్చిన రాధ అభ్యుదయవాది, ప్రగతిశీలి. ఆమె మామగారి భావాలను వ్యతిరేకిస్తుంది. ఇలా ఇద్దరి మధ్య వైరుధ్యం ఏర్పడి అనేక సందర్భాలలో ఘర్షణ పడుతుంటారు. చివరికి కోడలి ప్రభావంతో నీలకంఠమూర్తిలో మార్పు కలగటంతో నవల ముగుస్తుంది. సమాజంలో మార్పును ఆశించి రచయిత ఈ నవలను చిత్రించడం జరిగింది.

**1.12.15. జలపాతం :** 19 మే 2001 నుంచి 05 జనవరి 2002 వరకు ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రికలో ధారావాహికంగా ప్రచురితమైన నవల ఇది. మిత్ర ద్రోహానికి సంబంధించిన కథ. ఇందులో దొంగ సన్యాసుల మాటలు నమ్మి మనిషి ఎలాంటి స్థాయికి దిగజారాడో వాటి ప్రస్తావన, కాంట్రాక్టు పెళ్ళిళ్ల ప్రస్తావన, ఉన్నత వర్గాల మధ్య వ్యాపార ఆధిపత్య పోరు ప్రస్తావనలు ఈ నవలలో కనిపిస్తాయి. అంతర్లీనంగా ఒక దానితో ఒకటి సంబంధం కలిగి ఉండటం ఈ నవలా కథనం లోని ముఖ్య విశేషం.

**1.12.16. అగ్ని తీర్థం :** 6 జూలై 2002 నుండి 25 జనవరి 2003 వరకు ఆంధ్రభూమి సచిత్ర వార పత్రికలో ధారావాహికంగా ప్రచురితమైన నవల ఇది. పతిత కథ. ప్రధాన పాత్ర చారులతది. ఆమె అందమే ఆమె పాలిట శాపంగా మారింది. ఈమె భర్త జూదరి, తాగుబోతు. ఇతని స్నేహితుడు ఆమెను అనుభవించాలని కుట్ర పన్నుతాడు. ఆమె లొంగదు. దాంతో అతను

ఆమె మీద కోపం పెంచుకొని భర్తకు లేనిపోనివి కల్పించి చెప్పి ముంబాయి రెడ్‌లైట్ ఏరియాకు ఆమెను అతను అమ్మేస్తాడు. ఆమె ఎలాగో అలాగా తిరిగి బయటపడి తన జీవితాన్ని నాశనం చేసిన వారిని, అందుకు సహకరించిన వారిని అంతమొందించడమే ఇందులోని ప్రధానాంశం.

**1.12.17. ఆమె నా భార్య కాదు :** 30 జనవరి 2004 నుండి 14 మే 2004 వరకు స్వాతి సపరి వార పత్రికలో ధారావాహికంగా ప్రచురితమైన నవల ఇది. భార్యా భర్తల కథ. భార్యాభర్తలిద్దరు చదువుకున్నవారే. ఆర్థిక స్థోమత ఉన్నవారే. కాని ఇద్దరిలో భర్త మృదుస్వభావి, పరిస్థితులను అర్థం చేసుకొని కలిసి జీవించాలని కోరుకుంటాడు. వీటన్నింటికి భార్య వ్యతిరేకం. అహంకార స్వభావి. తన స్వార్థం తానే చూసుకునే గుణం కలది. ఈమె భర్తకు దూరమై అనేక కష్టాలను కొనితెచ్చుకుంటుంది. భర్తనుంచి ఏమి కోల్పోయిందో తెలుసుకొని అనేక గుణపాఠాలని నేర్చుకొని తిరిగి అతనికి దగ్గరవడమే ఇందులోని ప్రధాన ఇతివృత్తం.

**1.12.18. ఓ స్త్రీ ఆత్మ కథ :** 22 జనవరి 2004 నుంచి 31 మార్చి 2004 వరకు ఆంధ్రభూమి దిన పత్రికలో ధారావాహికంగా ప్రచురితమైన నవల ఇది. ఓ స్త్రీ ఆత్మ చెప్పకునే కథ. ఓ స్త్రీ పెళ్ళినాటి నుంచి మరణించే వరకు సాగే కుటుంబ నేపథ్యంగా చిత్రించిన నవల. ప్రధాన పాత్ర అరవింద. ఈమె భర్తకు తోడు నీడై అతని బాగులో భాగమవుతుంది. పిల్లల్ని పెంచి పెద్ద చేసి వారిని తీర్చిదిద్దుతుంది. స్నేహితులకి, తన చుట్టూ ఉన్న సమాజానికి సాయపడే వ్యక్తిత్వం కలిగిన స్త్రీమూర్తి. ఇందులో ఇదే ప్రధాన ఇతివృత్తం.

**1.12.19. ఓ సూర్యుడు... ఒక వెన్నెల :** 21 ఆగష్టు 2006 నుంచి 04 నవంబర్ 2006 వరకు ఆంధ్రభూమి దిన పత్రికలో ధారావాహికంగా ప్రచురితమైన నవల ఇది. మానవీయతకు హద్దులు సరిహద్దులు లేవని నిరూపించిన నవల. విదేశీయురాలైన జన్నిఫర్ అనే యువతి తన ప్రేమకు హాని తలపెట్టినా, అందవిహీనంగా ఉండే మన దేశ రంగులు అనే పేరుగల యువతిని సింగపూర్‌లో అందగత్తెగా మార్చి చిత్ర పరిశ్రమల్లోనే ఒక తారగా వెలుగొందేటట్లు చేస్తుంది. అలా ఆమె జీవితాన్ని మార్చేస్తుంది. ఇందులో ప్రధాన ఇతివృత్తం ఇదే. మానవ సంబంధాలకే దిశా నిర్దేశం చేయగల జన్నిఫర్ పాత్ర కలకాలం సమాజంలో సజీవంగా నిలిచిపోతుంది.

**1.12.20. తులాభారం :** మే, 2008లో స్వాతి మాస పత్రికలో అనుబంధ నవలగా ప్రచురితమైన నవల ఇది. సంప్రదాయ కుటుంబ వ్యవస్థలోని వివాహాలు భౌతికంగా కలపడమే కాని మానసికంగా మిళితం కాలేని విధంగా మారినప్పడు అదే కుటుంబ వ్యవస్థ ఆ వివాహిత స్త్రీకి న్యాయం చేయడం ఇందులో ప్రధాన ఇతివృత్తం. స్త్రీకి పెళ్ళి అనేది సుఖసంతోషాలనివ్వాలి కాని శాపంగా మారకూడదనేది ఈ నవల చెబుతుంది. ఇది రచయిత సృజనకు అద్దం పట్టిన నవల.

**1.12.21. ప్రణవనాదం :** ఫిబ్రవరి 2008లో స్వాతి మాసపత్రికలో అనుబంధ నవలగా ప్రచురితమైన నవల ఇది. డబ్బే ముఖ్యమని మనిషి పరిగెడుతున్న సందర్భం ఇది. దానికోసం ఎంతకైనా తెగిస్తున్నాడు. ఓ అమ్మాయి తన తల్లి ద్వారా సంక్రమించిన ఆస్తిపై కన్ను పడి ఆ ఆస్తిని ఎలాగైనా తమ సొంతం చేసుకోవాలని ఓ దుర్మార్గపు పథకం వేస్తారు బంధువులు. ఆమె వారి కుట్రను పటాపంచలు చేసి తను ప్రేమించిన వ్యక్తితో జీవించాలనుకోవడమే

ఇందులో ప్రధాన ఇతివృత్తం. ఆర్థిక సంబంధాల కన్నా మానవ సంబంధాలే బలమయినవిగా నిరూపించిన నవల.

**1.12.22. నైనం ఛిన్దన్తి శస్త్రాణి :** సెప్టెంబర్ 2009లో స్వాతి మాసపత్రికలో అనుబంధ నవలగా ప్రచురితమైన నవల ఇది. మనిషి శరీరం నశిస్తుంది. కాని ఆ శరీరంలో ఆత్మకు నాశనం లేదు. మానసికంగా తీసుకున్న నిర్ణయం ఎన్ని అవాంతరాలు ఎదురైనా, ఎవరు ఎన్ని రకాలుగా మాట్లాడుకున్నా, మనసులో ఏర్పడ్డ భావం మారదని నిరూపించి, విజయాన్ని సాధించిన మధ్యతరగతి అమ్మాయి జీవితాన్ని ప్రతిబింబించే నవల.

**1.12.23. హింసధ్వని :** జూలై, 1989 నుంచి మే, 1990 వరకు స్వాతి మాస పత్రికలో ధారావాహికంగా ప్రచురితమైన నవల ఇది. ఇందులో సుందరి, ప్రశాంత్ ప్రధాన పాత్రలు. ప్రశాంత్ సంఘంలో పేరున్న నాయకుడు. ఇతను చీకటి ప్రపంచంలో ఎన్నో చీకటి వ్యాపారాలు చేయిస్తుంటాడు. యువతి, యువకులనూ, ఎన్నో కుటుంబాలను బలి తీసుకుంటాడు. ఆ కుటుంబాలలో సుందరి కుటుంబం ఒకటి. దానికి ప్రతీకారంగా అతని అంతు చూడాలనుకుంటుంది. తెలివిగా అతన్ని పెళ్లి చేసుకొని, చంపి, చీకటి వ్యాపారాన్ని చట్టానికి పట్టించి, ఆమె పోలీసులకు లొంగిపోవడంతో నవల ముగుస్తుంది.

**1.12.24. రేపటి మందారం :** 16 జూలై 1999 నుంచి 13 సెప్టెంబర్ 1999 వరకు వార్త దిన పత్రికలో ధారావాహికంగా ప్రచురితమైన నవల ఇది. ఇందులో కథానాయకుడు ఆదిత్య, ప్రతి కథానాయకుడు మౌని. మరో రెండు స్త్రీ పాత్రలు కన్పిస్తాయి. వారే నాగమల్లి, సుధలు. నాగమల్లిని ప్రేమ పేరుతో అనుభవించి, మోసం చేసి వ్యభిచారినిగా ముద్రపడేటట్లు చేస్తాడు మౌని. ఆస్తి కోసం చెల్లెలి భర్తను చంపి ఆమెను విధవను చేసిన వ్యక్తి కూడా మౌనే. ఇన్‌స్పెక్టర్ అయిన ఆదిత్య చాకచక్యంగా చిక్కుముళ్లను ఛేదించి మౌనిని అతనికి సహకరించిన వారిని పట్టుకొని దోషులుగా నిరూపిస్తాడు. అలాగే నాగమల్లి, సుధల జీవితాలను తీర్చిదిద్దుతాడు.

**1.12.25. నాకు పది రోజులు చాలు :** 10 సెప్టెంబర్ 1999 నుంచి 5 నవంబరు 1999 వరకు స్వాతి సపరి వార పత్రికలో ధారావాహికంగా ప్రచురితమైన నవల ఇది. ఇందులో కథానాయకుడు జగదీశ్. ఇతనికి డబ్బు అవసరం వుండి ఓ నేరస్తుని దగ్గర పనికి కుదురుతాడు. ఆ నేరస్తుడు ఇచ్చే డబ్బు అన్యాయంగా సంపాదించినది అని అతడు తెలుసుకుంటాడు. ఆ నేరస్తుడు ఎంచుకున్న మార్గం తప్పని చెప్పి చూస్తాడు ఆ యువకుడు. అతడు ఇతనిని ఎలాగైనా చంపాలని చూస్తాడు. తెలివితో ఆ హంతకుని చట్టానికి పట్టించడంతో నవల ముగుస్తుంది.

**1.12.26. హెచ్చరిక :** 26 జూన్ 2000 నుండి 16 డిసెంబరు 2000 వరకు ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రికలో ధారావాహికంగా ప్రచురితమైన నవల ఇది. ప్రవాసాంధ్ర పెళ్లి కొడుకుల మోసాల్ని నేపథ్యంగా చిత్రించిన నవల. ఇందులో స్పందన అనే అమ్మాయి ఉంటుంది. ఈమెకు తల్లిదండ్రులు అమెరికా సంబంధం చూస్తారు. ఆ సంబంధం ఖాయం అవుతుంది. ఆ పెళ్లి కొడుకు వెనుక ఓ మోసగాడు ఉంటాడు. అతను ఇంతకుముందే మోసంతో ముగ్గురమ్మాయిల జీవితాలను నాశనం చేస్తాడు. ఇతని ద్వారా ఆ మోసగాన్ని ఇండియాకు రప్పించి, అతని నేరాలన్నింటిని నిరూపించి కటకటాల పాలు చేయడంతో నవల ముగుస్తుంది.

**1.12.27. నన్ను రక్షించండి ప్లీజ్!... :** 16 నవంబరు 2000 నుంచి 14 జూన్ 2001 వరకు ఆంధ్రభూమి సచిత్ర వార పత్రికలో ధారావాహికంగా ప్రచురితమైన నవల ఇది.

ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల జీవితాన్ని నేపథ్యంగా తీసుకొని చిత్రించిన నవల. ఇంజనీరింగ్ చదువును పూర్తి చేసుకొని వెళ్ళే ముందు వినూత్నమైన ఓ ఆట ఆడతారు. ఆ ఆట వల్ల ఓ విద్యార్థిని హత్యకు గురౌతుంది. తన ప్రేమకు అడ్డొస్తుందని ఆట సాకుగా తీసుకొని తోటి విద్యార్థినిని హత్య చేయిస్తుంది. పైకి ఏమీ ఎరగనట్లు ఉంటుంది. జయంత్ అనే యువకుడు జర్నలిస్టు. అతను హత్య వెనుక ఉన్న చిక్కుముళ్ళను ఛేదించి అసలు హంతకురాలిని పట్టుకోవడంతో నవల ముగుస్తుంది.

**1.12.28. ఇరవై ఆరు గంటలు :** సెప్టెంబర్ 2005లో స్వాతి మాస పత్రికలో అనుబంధ నవలగా ప్రచురితమైన నవల ఇది. ఇల్లాల్ని, ప్రియురాల్ని మోసం చేసిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జీవితాన్ని తీసుకొని ఆవిష్కరించిన నవల. ఇందులో ఆదిత్య సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఇతని భార్య కావేరి. ఓ ఇన్‌స్టిట్యూట్‌లో సౌజన్య ఇతనికి పరిచయమవుతుంది. ఆమె కోట్ల ఆస్తికి వారసురాలు. ఇతనికి ఆమె ఆస్తిపై కన్నుపడుతుంది.  తనకి పెళ్ళి కాలేదని ఆమెకు అబద్ధం చెబుతాడు. ఇద్దరు ప్రేమలో పడతారు. ఆమెతో పెళ్ళి కావాలంటే అడ్డుగా ఉన్న తన భార్యను చంపాలనుకుంటాడు. ముందే ఇదంతా తెలుసుకున్న ఆ ప్రేయసి ఆ ఇల్లాల్ని రక్షించి అతనికి బుద్ధి చెప్పడంతో నవల ముగుస్తుంది.

**1.12.29. మొదటి రాత్రి :** అక్టోబర్ 2008లో స్వాతి మాస పత్రికలో అనుబంధ నవలగా ప్రచురితమైన నవల ఇది. ధనిక వర్గాల్లోని యువతి యువకుల్లో ఉండే వింత కోరికల వల్ల ఎన్ని కష్టనష్టాలను ఎదుర్కోవలసి వస్తుందో చక్కగా చిత్రించిన నవల. ఆర్థిక ప్రయోజనాల కోసం ఐటి రంగం ఎంతగా ప్రభావితం చేస్తాయో, మానవతా సంబంధాలు ఎంతకు దిగజారుస్తున్నాయో చక్కగా వివరించడమే ఇందులో ప్రధాన అంశం.

**1.12.30. ప్రేమంటే మజా కాదు :** 17 మే 1989 నుంచి 26 జూలై 1989 వరకు ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రికలో ధారావాహికంగా ప్రచురితమైన నవల ఇది. హాస్యానికి సంబంధించినది. ఇందులో సీతామహాలక్ష్మి సింహాద్రిలు ఉంటారు. సీతామహాలక్ష్మి గడసరి అమ్మాయి. తన అందంతో ఎదురింటి సింహాద్రిని ఆకర్షించేటట్లు చేసి, చివరికి అతనిని తన ప్రేమలోకి దింపుతుంది. ఇద్దరు పెద్దల సమక్షంలో పెళ్ళి చేసుకోవడంతో నవల ముగుస్తుంది. నవలంతా హాస్యరసంతో సాగడం ఇందులోని విశేషం.

ఇవిగాక ఇంకా ఆరు నుంచి ఎనిమిది నవలలు ప్రచురణకు సిద్ధంగా ఉన్నాయి.

## 1.13. కథా సాహిత్యం :

'స్వం నాస్తి' అన్నది పి.ఎస్. నారాయణ మొదటి కథ. ఈ కథ 1957లో గుంటేరు పత్రికలో ప్రచురితమైంది. ముఖ్యంగా ఆంధ్రప్రభ పత్రిక ఆయన కథల్ని ప్రచురించి రచయితగా ఎదిగేలా ప్రోత్సాహాన్నిచ్చింది. ఆ తర్వాత జ్యోతి, సాహితి, యువ, ఆంధ్రజ్యోతి, స్వాతి, ఉదయం, ఇండియాటుడే, ఆంధ్రభూమి, ఈనాడు వంటి దిన, వార, మాస పత్రికలలో ఆయన కథలు ప్రచురితమయ్యాయి.

"1957-58 ప్రాంతంలో రచయితగా తన జీవితాన్ని ప్రారంభించి ఐదు దశాబ్దాలుగా కథా సాహిత్య సృజన జీవితంలో 230కి పైగా కథలు రచించారు. "[22] పి.ఎస్. నారాయణ. ఈయన కథలలోని వస్తువు సమకాలీనమైనది. సమాజంలో తాను చూసిన ఒక సంఘటనను గానీ లేక దర్శించిన ఒక సమస్యను గానీ, తటస్థపడిన ఒక వ్యక్తినో చూసి,

స్పందించి అనుభూతిని పొంది వాస్తవమైన విషయానికి తన ఆలోచనని, ఆదర్శాన్ని, సందేశాన్ని జోడించి రచించటం ఆయనకు అలవాటు.

కథా వస్తువు ఒక నిర్ధారిత రూపంలో ఉండదు. కాబట్టి దానిని కథకి అనుగుణమైన రూపంగా మలుచుకోవలసిన అవసరం ఉంటుంది. అంటే ఒక రాయిని తీసుకొని శిల్పంగా చెక్కటం అన్నమాట. పి.ఎస్.నారాయణ అన్ని కథలలో ఈ పని చేసారు. ఆయన కథల ముడిసరుకు కథారూపంలో వచ్చేసరికి ఎన్నో అందాల్ని, ఎన్నో సౌష్టవాల్ని సమకూర్చుకుంటుంది. వివేకరి ఉన్నది ఉన్నట్లు రాస్తే వార్త అవుతుంది. కాని అది సృజనాత్మక రచన కాదు. కథావస్తువును జీవితం నుండే స్వీకరించాలి, అనుభవంలో నుండే దర్శించాలి, అలోచనలతోనే కథని సౌందర్యమయం చేయాలని కథలు రాసిన వారు పి.ఎస్.నారాయణ.

అర్ధ శతాబ్దం పి.ఎస్. నారాయణ కథా రచనాకాలాన్ని ఈ కింది విధంగా దశలవారీగా స్థూలంగా పరిశీలిద్దాం.

**మొదటి దశ (1957-1970) :** ఈ దశలో మొత్తం 66 కథలు వచ్చాయి. వీటిలో ఎక్కువగా మధ్యతరగతి కుటుంబాలలో వుండే వ్యక్తుల మధ్య ప్రేమానురాగాలు, స్వార్ధం, హాస్యం, త్యాగం, కల్మషాలను గురించినవి. ఇవేకాక నిరుద్యోగ, ఆర్థిక సమస్యలతో వచ్చిన కథలు కన్పిస్తాయి.

**రెండవ దశ (1971-1980) :** ఈ దశలో 43 కథలు వచ్చాయి. భార్యాభర్తల మధ్య ఉండే ఆర్థిక అసమానతలు, వాటివల్ల కలిగే మనస్పర్థలు, పేదరికంలో నలిగిపోతున్న వ్యక్తులు వాళ్ళపై పైశాచికంతో పెత్తనం చెలాయించే వ్యక్తుల గురించినవి. సమకాలీన సమస్య అయిన వరకట్నం గురించి, ఈ సమస్యలతో నలిగిపోయే స్త్రీ మానసిక సంఘర్షణ, ఆధునిక సమాజంలో కాలంతో పాటు మనుషులు మారాలని తెలిపే కథావస్తువులతో కథలు వచ్చాయి.

**మూడవ దశ (1981-1990) :** ఈ దశలో వచ్చిన కథలు 21. ఈ దశలో కూడా పై రెండు దశల్లో వచ్చినట్లుగానే కథావస్తువులు కన్పించటమే కాక మారుతున్న సమాజ జీవితానికి అనుగుణంగా కథావస్తువులో కూడా పరిణామం ఉందని ఈ సమస్యల వల్ల అర్థం చేసుకోవచ్చు. సగటు ఉద్యోగి శెలవు కోసం పడే అగచాట్లు, స్త్రీ జీవితంలోని అనేక కోణాలను స్పృశించుకుంటూ వచ్చిన కథలు కన్పిస్తాయి.

**నాలుగో దశ (1991-2000) :** ఈ దశలో మొత్తం 54 కథలు వచ్చాయి. మన సమాజంలోని సామాజిక రుగ్మతల మార్పుకోసం ఎందరో ఎన్నో ఉద్యమాలు నడిపినా, కొంత మార్పు వచ్చినా వాటి ఛాయలు అక్కడక్కడ నేటికి కన్పిస్తున్నాయి. బాల్య వివాహాలు, మూఢ విశ్వాసాలు, వేశ్యా సమస్యలు మొదలగు సమస్యలను తీసుకొని కథలని చిత్రించారు.

**ఐదవ దశ (2001-2009) :** ఈ దశలో 49 కథలు వచ్చాయి. ఈ కాలంలోని అమ్మాయిలు తమ అవసరాలకోసం ఏపని చేయటానికైనా సిద్ధపడి మోసపోతున్నారని తెలిపే కథలు వచ్చాయి. అలాగే భార్యలకు అన్యాయం చేసిన భర్తలకు పశ్చాత్తాపం తప్పదని చెప్పే కథలు వచ్చాయి. స్త్రీ చైతన్య, సామాజిక, ఆర్థిక సంబంధాలున్న కథావస్తువులే కాక ఆత్మాభిమానం, ఆత్మీయ అనురాగాలను కథావస్తువులుగా తీసుకొని కథలను చిత్రించడం జరిగింది.

ప్రధానంగా మధ్యతరగతి జీవితం, పెళ్ళి, నిరుద్యోగం, స్త్రీ సమస్యలు, కార్మిక సమస్యలు ప్రధానంగా చేసుకొన్న ఆయన కథా సాహిత్యం అనేక మైలు రాళ్ళను దాటి నేటివరకు నిరంతర

ప్రవాహఝురిలా కొనసాగుతుంది. ఆయన జీవితంలో దశలున్నట్లుగానే ఆయన కథా సాహిత్య సృజన జీవితంలోను కొన్ని దశలున్నాయి.

## 1.14. నాటికలు :

కథా రచయితగా, నవలాకారుడుగా సుప్రసిద్ధుడైన పి.ఎస్. నారాయణ నాటిక సాహిత్యాన్ని కూడా సృజించారు. పదిదాకా రేడియో నాటికలు, రెండు స్టేజి నాటికలను రచించారు. ఇందులో ఒకటి మాత్రమే లభ్యమవుతుంది. తక్కినవి అలభ్యం. 'నాన్యః పంథాః...' అనే సాంఘిక నాటిక మాత్రమే అందుబాటులో ఉంది. ఇందులో పశుకామానికి బలైపోయిన ఇల్లాలిని గురించి వస్తువుగా ఎన్నుకున్నారు.

## 1.15. ఇతర రచనలు :

నవల, కథ, నాటిక వంటి సృజనాత్మక రచనలే గాక మంచి సమీక్షకుడిగా పి.ఎస్. నారాయణ కన్పిస్తారు. ఇందులో వివిధ ప్రక్రియలకు సంబంధించిన ఇరవై సమీక్షలున్నాయి. సమీక్ష వ్యాసాలన్నీ వివిధ పుస్తకాలకు సంబంధించినవి. ఈ వ్యాసాలన్నీ ఆంధ్రభూమి పత్రికలో ప్రచురితమయ్యాయి. వీటిలో నేపథ్యం, పాత్రలు, పాత్రల మనస్తత్వ చిత్రీకరణ, వస్తువును గురించిన చర్చ చేశారు. రచనలో ఉన్న పొరపాట్లను సున్నితంగా ఎత్తిచూపడం కన్పిస్తుంది.

నవల, కథ, నాటికలు రచించి, సమీక్షలు చేసిన పి.ఎస్. నారాయణ తన రచనలన్నింటిలో సృజనాత్మకత ఉండేందుకు తపించారు. కొన్ని పాత్రలు కథల్లోనూ, నవలల్లోనూ కూడా దర్శనమిస్తాయి. కాని వాటిని ఆదర్శించే కోణాల్లో నూతనత్వం చోటుచేసుకుంటుంది.

సృజనాత్మక రచనలలోని స్త్రీ పాత్రలు కాలాన్ని దాటుతూ వచ్చే విధానం, తమ జీవితాలలో ఎదురయ్యే కష్టాల్ని చూస్తూ ఊరుకోకపోవడం కన్పిస్తుంది. స్త్రీ పాత్రలన్నీ తర్వాతి తరానికి మార్గదర్శకంగా నిలిచేవి. మరికొన్ని కథలలో ఆధ్యాత్మిక జీవితాన్ని కర్మ సిద్ధాంతం ఆధారంగా చిత్రించారు. నిత్య నూతనత్వమే సృజనాత్మకతకుచిహ్నం. పి.ఎస్. నారాయణ కథలు గాని, నవలలు గాని నిత్యనూతనంగా ఉంటూ సృజనాత్మకతకు అర్థం చెబుతూ ముందుకు నడుస్తాయి. మనల్ని నడిపిస్తాయి. ప్రతి కథ పాత సమస్యను తీసుకొని రచించినా కొత్త పద్ధతిలో ఆవిష్కరించడం కన్పిస్తుంది. కాలంతో ప్రయాణిస్తూ ఎదుగుదలను ఒక ఆయుధంగా మలచి మనిషిలో సృజనాత్మక ఆలోచనలను పెంచుతాయి. మనిషి ఆలోచనా పరిధిని విస్తృతం చేయడమే పి.ఎస్. నారాయణ సృజనాత్మక రచనలలోని ప్రధాన లక్షణంగా చెప్పవచ్చు.

## పాదసూచికలు :

1. దక్షిణామూర్తి పోరంకి - ఆంధ్ర సారస్వత పరిషత్తు వజ్రోత్సవ సంచిక - మనిషిని మలిచేదే సాహిత్యం, మనసులు విరిచేది కాదు. (వ్యాసం) - విష్ణు కంప్యూటర్ సర్వీసెస్, హైదరాబాద్ 2003, పుట 115.
2. కులశేఖరరావు ఎం. - మహతి సమీక్ష వ్యాస సంకలనం - తెలుగు వచన (రచన వ్యాసం 1972) - యువభారతి - డి.ఎస్. ఎంటర్‌ప్రైజెస్, హైదరాబాద్ 1972 - పుట 38
3. రచయితతో సంభాషణ - అనుబంధం -1.
4. పి.ఎస్. నారాయణతో ఇంటర్వ్యూ - నవ్య వీక్లీ - ఆంధ్రజ్యోతి ప్రచురణ, 07-04-2010, పుట 28
5. రచయితతో సంభాషణ - అనుబంధం -1.
6. పైదే.
7. పైదే.
8. పైదే.
9. పి.ఎస్. నారాయణతో ఇంటర్వ్యూ - నవ్య వీక్లీ - ఆంధ్రజ్యోతి ప్రచురణ, 07-04-2010, పుట 28
10. రచయితతో సంభాషణ - అనుబంధం -1.
11. పి.ఎస్. నారాయణతో ఇంటర్వ్యూ - నవ్య వీక్లీ - ఆంధ్రజ్యోతి ప్రచురణ, 07-04-2010, పుట 28
12. పైదే. పుట 29
13. రచయితతో సంభాషణ - అనుబంధం -1.
14. పి.ఎస్. నారాయణతో ఇంటర్వ్యూ - నవ్య వీక్లీ - ఆంధ్రజ్యోతి ప్రచురణ, 07-04-2010, పుట 28
15. నారాయణ పి.ఎస్. కథలు - స్వప్నం రాల్చిన అమృతం (కథా సంపుటి) - నా మాట... ఆకృతి ఆఫ్‌సెట్ ప్రింటర్స్, హైదరాబాద్ - 2009 - పుట 12.
16. చంద్రశేఖర రెడ్డి డి. సం॥ - తెలుగు సాహిత్యం - చారిత్రక నేపథ్యం - స్వాతంత్ర్యానంతర జన జీవన ధోరణులు. (వ్యాసం) - డా॥ డి. చంద్రశేఖర రెడ్డి - ఆంధ్ర సారస్వత పరిషత్ రజతోత్సవ సంఘ ప్రచురణ 1994, పుట 179.
17. వెంకట సత్యనారాయణ రాపూరు - మహతి వ్యాస సంకలనం - పత్రికలు, కథలు, (వ్యాసం) - యువభారతి - సికిందరాబాద్ - 1972 - పుట 177, 178.
18. నరసింహశాస్త్రి నోరి - మహతి వ్యాస సంకలనం - తెలుగు నవల (1947-1972) (వ్యాసం) - యువభారతి - సికిందరాబాద్ 1972, పుట 82.
19. రామారావు చేకూరి - సాహిత్య కిర్మీరం - స్వీయ ప్రచురణ - 2002 - పుట 135
20. Encyclopedia Britomica Mycropedia Vol. 1 - పుట 227.
21. ఆనంద వర్ధనుడు - అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతిః - ధ్వన్యాలోకం
22. పి.ఎస్. నారాయణ రచనలు అనుబంధం 2